ముసలమ్మ!

తను ముసలమ్మ!

శ్యామల ముసలమ్మ!

'టాక్సీ వచ్చింది అమ్మగారు" అని అటెండరు కంఠం వినిపించింది.

శ్యామల ఉలిక్కిపడ్డది.

"టాక్సీ దేనికి?" అని అడిగింది!

అతను ఆశ్చర్యంగా తనవంక చూశాడు. వూరు వెడదామని అన్నారుగా"

శ్యామలకు లీలగా గుర్తుకు వచ్చింది. పెట్టె అడుగున పెట్టిన ఉత్తరాలు, టెలిగ్రాము తీసుకుని బయలుదేరింది.

మర్నాడు అసుర సంధ్యవేళలో తను వూరు చేరింది.

ఇంట్లో ఎవ్వరూ లేరు. ఒక గదిలో నేలమీద నూనె దీపం పెట్టివుంది.

అంతా నిశ్శబ్దం.

తన తండ్రి యిహలేడు, తల్లి ఏనాడో లేదు.

తనకు ఎవ్వరూ లేరు, తనవాళ్ళు ఎవ్వరూ లేరు.

ఎవ్వరూ లేరు?

ఎవ్వరూ లేరు?

"శ్యామలా అంటూ ఒక కంఠం పలుకరించింది. ఆయన తనవూరి కరణంగారు.

నాన్న నీకు ఈ పెట్టె యిమ్మన్నాడమ్మా... అంటూ ఒక చిన్న పెట్టె యిచ్చాడు.

ఆ పెట్టెలో తనతల్లి మట్టెలు, మంగళసూత్రాలు వాటితోబాటు ఒక చిన్న కాగితం కనిపించింది.

కన్నీటితో తడిసిన కళ్ళతో ఆ ఉత్తరాన్ని విప్పింది. అందులో ఒకే ఒక వాక్యం వుంది.

ఆ ఉత్తరం రాసింది నేనే తల్లీ.

మీ నాన్న !

# పునర్జన్మ

"నువ్వు ఆరోగ్యం విషయం జాగ్రత్త వహించాలి. లేకపోతే ఈ జ్వరం దేంట్లోకి దింపుతుందో చెప్పలేం." అంటూ డాక్టరుగారు ఒక గట్టి హెచ్చరిక చేశారు.

జ్వరం ఇప్పటికే రెండోవారం ప్రవేశించింది. టైఫాయిడ్ కాదంటాడు డాక్టరు, ఏమిటేమిటో మందులిస్తున్నాడు. అన్ని మందుల కంపెనీల కొత్త కొత్త మందులన్నీ తనమీద వాడి చూశాడు. కాని ఫలితం శూన్యం !

కాని యిదేదో టైఫాయిడ్ కన్నా బలమైన విషజ్వరం, తన స్నేహితులలో ఇద్దరు టైఫాయిడ్ లాంటి జ్వరం వల్లనే, అది ఏనాడో డాక్టర్లు తేల్చుకునే లోపల పోయారు.

ఎంత బలంగా ఎంత హుషారుగా వుండేవాళ్లో ఎవరూ కూడా అనుకోలేదు.

చూస్తుండగానే పోయారు.

తనుకూడా పోతాడేమో!

ఈ వయస్సులో మారకం వున్నదని జ్యోతిష్కుడు కూడా చెప్పాడు.

తన బ్రతుకుకూడా రోజుల్లో పడ్డది!

ఏ క్షణంలోనైనా పిలుపు రావచ్చు !!

తను పోతే ! తను లేకపోతే ?

తన తల్లీ చెల్లెలూ ఏమవుతారో ! అమ్మకు వున్న ఈ ఒక్క ఆధారం పోతే ఎలా బ్రతుకుతుంది? చెల్లాయికి పెళ్ళిచేద్దామని ఈ ఏడు గట్టి ప్రయత్నం చేద్దామని అనుకున్నాడు.

కాని సాగలేదు.

తను పోతే ఈ భారమంతా ఎవ్వరు నెత్తిన వేసుకుంటారు?

అమ్మకు చెల్లాయికి ఈ విషయం యింకా తెలియదు. తెలిస్తే ఎంతబాధ పడతారు.

ఐనా తన కెందుకింత అధైర్యం? జబ్బు చేసిన వాళ్ళంతా పోతారా?

క్రిందట సంవత్సరం చంద్రం వాళ్ళ బాబాయికి టైఫాయిడ్ వచ్చి నలభై లంఖణాలు చేసి తగ్గలేదా? ఏమిటో ఆయన ఎప్పుడూ జబ్బు మనిషే? అటువంటివాళ్ళే ఎన్ని డిక్కా మక్కీలైనా ఓర్చుకోగలరు.

నేడో రేపో అంటూనే గుండెజబ్బుతో రామం భార్య పది సంవత్సరాలు బ్రతికింది.

రాయిలాగా వుండే రామం ఒక్కపూట జ్వరంతోనే కన్ను మూశాడు.

తనకు ఏనాడు జలుబుకూడా చెయ్యలేదు. ఈనాడు చూస్తూవుండగానే యింత పెద్దరోగం ముంచి పెట్టుకు వచ్చింది. !

శరీరం ఎంతో శిథిలమై రోగం జీర్ణించి ఈదశకు వచ్చింది. చిట్టచివరకు కట్టడినుంచి ఈ రూపేణా బయటపడింది!

ఈ తాకిడికి ఈ శరీరం తట్టుకోలేదు !!

తను పోతే అమ్మా చెల్లాయి చాలా విచారిస్తారు. శ్యామల, జానకి చాలా విచారిస్తారు! చాలా బాధపడతారు.

ఈబాధకు వాళ్ళు తట్టుకోగలరా!

పోయేముందర వాళ్ళిద్దరినీ ఒక్కసారి చూడాలి!

శ్యామల వస్తుందా?

జానకి వస్తుందా?

శ్యామలని భర్త వెళ్ళనిస్తాడా?

ఎంతకర్కోటకుడుగా మారాడు? అదృష్టం కలసివచ్చి ఆ పిల్లని భార్యగా పొందాడు. కాని ఆ భర్తని మాత్రం శ్యామల ఎన్నో జన్మల శాప ఫలితంగా పొందింది.

ఉన్నత భావాలు, సమానహక్కులు యివన్నీ యింటిబయటనే.

జానకి మాత్రం ఈ వార్త తెలియగానే రెక్కలు కట్టుకుని వ్రాలుతుంది. తన దగ్గర జానకి వుంటే ఎటువంటి విపత్తునైనా తను నవ్వుతూ ఎదురుకోగలదు.

జానకి! జానకి!

జ్వరం నూటమూడు డిగ్రీలని యింగ్లీషు ధర్మామీటరు చెబుతోంది.

సాయంత్రానికి నూట నాల్గు కావచ్చు! లేదా ఏమో !

చెల్లాయికి మైసూరు జార్జిట్ చీరె కావాలని అడిగింది. కొందామని అడుగుతూ వుండగానే వాయిదాలు పడుతూ వచ్చాయి.

అది ఎన్నడూ తనని ఏ విషయం అడగలేదు. దాని కోరిక తీర్చకుండానే వెళ్ళిపోతానా??

ఏమిటో వెలుగు! ఏదో చీకటి! ఏదో అవేదన? ఏదో భయం !!......

కాలం ఎన్ని క్షణాలు గడిచిందో? ఎన్ని యుగాలు గడిచిందో?

"పదమూడు రోజులమ్మా యివ్వాళకు సరిగ్గా" అని అమ్మ ఎవరితోనో అంటోంది.

ఇది ఆఖరి జ్వరమని అంతరాత్మ ఎందుకని అంటోంది? మృత్యోమా అమృతంగమయా !! అంతా అబద్ధం! ఇదంతా అబద్ధం.

తనకు రాసిన ఉత్తరానికి జానకి ఎంత నిర్లక్ష్యంగా సమాధానం యిచ్చింది.

"ఇప్పుడు చాలా పనిలో వున్నాను వీలు చూసుకుని వస్తున్నా !

తను చావు, బ్రతుకులో వుంటే తనకు యింతకంటే యింకా ముఖ్యమైనవి ఏమిటి?

జానకి నన్ను ప్రేమిస్తోందని ఎంత అపోహలో వున్నాను. ఎన్ని ఆశలు పెట్టుకున్నాను.

"చాలా పనిలో వున్నాను"

ఆ పని తేలేదాకా తన ఆయువు నిలుస్తుందా !!

శ్యామల భర్తతో పోట్లాడి వచ్చేసింది. రామానికి సుస్తీగా వుంది నేను వెళ్ళితీరాలని పట్టుబట్టి వచ్చేసిందట. వచ్చిన దగ్గరనుంచి తనని ఒక్క క్షణం కూడా విడిచిపెట్టి వుండటం లేదు.

జానకి కోసం జీవితమంతా తను ఎంతో తపనపడ్డాడు. తనని ఎంతో గాఢంగా ప్రేమిస్తోందని నమ్మి యింతకాలం వున్నాడు. ఈ నమ్మకమంతా ఒక లిప్తకాలంలో మాయమైంది. తను జీవితమంతా ఎండమావుల వెంట పరుగెత్తాడు.

కావలసిన లక్ష్యం చేరవలసిన గమ్యం ఎప్పటికప్పుడు ఆమడ దూరమే. తనకు అదృష్టమే ఆమడదూరం!

శ్యామల తనని గాఢంగా ప్రేమించింది కాని తను ఆ ప్రేమని గుర్తించే లోపలే ఆ పిల్ల పరాయిది అయింది. మనస్సులోని మసగ బొమ్మ మనస్సున హత్తుకుపోక పూర్వమే సెలఏటి గలగలలాగ, వలపు వెన్నెలలాగా తియ్యని కలలాగా జానకి వచ్చింది. రావటమేకాదు తొలి చూపులోనే, మలి పలుకులోనే మనస్సు యిచ్చి పుచ్చుకుంది. మనస్సు యిచ్చిందని తను ఈనాటి వరకు నమ్మివున్నాడు. కాని తను ప్రాణాపాయ పరిస్థితిలో వుండగా జానకి యిచ్చిన నిర్లిప్తత నిర్వికార సమాధానం.

"చాలా పనిలో వున్నాను. వీలుచూచుకుని వస్తాను!" తన సర్వస్వం జానకి యిచ్చినా తనివి తీరదని ఆనాడు అనుకున్నాడు.

కాని ఈనాడు శ్యామల తన సర్వస్వం కంటె ఎక్కువైంది !! తన సర్వస్వం అని

అనుకోవడానికి ఈనాడు తన దగ్గరేముంది?

ఒక రవ్వల వుంగరం. బ్యాంకిలో పదివేలు. ప్రాణం పోయేలోపల మిగతా వాళ్ళకి ఏదైనా ఏర్పాటుచెయ్యాలి!

బ్యాంకులో డబ్బు కట్నంగా యిచ్చి చెల్లాయిని శంకరం బావకి యిచ్చి మేనరికం చెయ్యాలి.

నా పుస్తకాలు ఏదైనా లైబ్రరీకి

రవ్వల వుంగరం శ్యామలకి

మరి జానకికి?

జానకికి యింకా ఏమి యివ్వాలి? అన్నింటికంటే ఎక్కువైన ప్రేమని హృదయాన్నే యిచ్చాడే?

తను యిచ్చిన గౌరవాన్ని నిలబెట్టుకోలేక పోయింది.

జానకి చిన్నప్పుడు ఎంతో బాగుండేది కాని యిప్పుడు మాత్రం ! కాని ఈనాడు ఏదో వ్యత్యాసం కనిపిస్తోంది. కాని అదేమిటో మాత్రం తెలియటంలేదు.

శ్యామలా! జానకి వీళ్ళ యిద్దరిలో ఎంత తేడా వుంది !! ఇద్దరూ అందగత్తెలే ఒకరి సౌందర్యం శరీరాన్ని ఆవరించుకుని వుంటే యింకొకరి సౌందర్యం హృదయంలో స్థానం ఏర్పరుచుకుని తనకు క్షేమాన్ని చేకూరుస్తుంది.

జానకిని ఈ క్షణం వరకూ తను ప్రేమిస్తున్నాడు. జానకి వల్ల తను సుఖపడగలడో లేదో తనకు తెలియదు. కాని శ్యామల వల్ల ఎటువంటి వ్యక్తి అయినా సరే ఆకర్షింపబడతారు. శ్యామలని ప్రేమించిన వాడు, శ్యామల సేవకు దాసుడై యింకా గాఢమైన బంధంలో చిక్కుకుంటాడు.

వాత్సల్యానికి, ప్రేమకు ఈనాడు ఒరిపిడి రాయి. జానకి దూరమైంది. శ్యామల చేరువైంది.

బ్యాంకులో డబ్బు పెట్టి చెల్లాయి పెళ్ళి చేస్తే పొలం మీది అయివేజుతో అమ్మ సుఖంగా వుండవచ్చు ...

చెట్టంత కొడుకు పోయినతరువాత యింకా సుఖం ఏమిటి?

చావుని తలంచుకుని చాలా మంది భయపడతారు... ఎందుకు

భయపడుతారు?

ఎందుకని? ఎందుకాభయం?

అనుకున్న అనేక పనులు చెయ్యకుండానే వెళ్ళిపోతున్నాననే చింతా నిరాశా, మినహా తనకు ఎటువంటి భయం కలగటం లేదు, పుట్టుట గిట్టుట కొరకే అన్నమాట తను ఏనాడూ మరువలేదు. కాని?...

కాని... ఈ ప్రశ్నకు సమాధానం మనసుని ఎంత మధించినా తనకు లభ్యం కాలేదు.

యుగాలు గడిచి పోతున్నాయి. క్షణాలు నిలచి పోతున్నాయి. కాగితం కలం తీసుకుని రాయటం మొదలు పెట్టాడు. ఎంతో ప్రయత్నం చేస్తేగాని కలం ముందుకు సాగటం లేదు.

రవ్వల వుంగరం శ్యామలకు యివ్వాలి... పుస్తకాలు పబ్లిక్ లైబ్రరీకి యివ్వాలి... బ్యాంకిలోని డబ్బు పెట్టి చెల్లాయి పెళ్ళి చెయ్యాలి. కాలం యిహ ముందుకు సాగటం లేదు, మనసులో ఎక్కడో మారుమూల దాక్కున్న సంఘటన లీలగా గుర్తుకు వచ్చింది.

అప్పుడు తనకు పదహారు సంవత్సరాల వయస్సు, దీపావళి పండుగకి ఒక పెద్దావిడ, ఆవిడ వెంట ఒక పదమూడు సంవత్సరాల అందమైన అమ్మాయి తమ యింటికి వచ్చారు. పగలంతా ఎంతో సరదాగా గడిచింది. రాత్రి మతాబాలు కాలుస్తూ వుంటే ఆ పిల్ల బట్టలకు నిప్పు అంటుకుంది, క్షణంలో పమిటలాగివేసి దూరంగా పారవేశాడు.

ఆ పిల్లకేం ప్రమాదం జరగలేదు. తనకే చెయ్యి కాలింది. పట్టుఓణి అంతా చూస్తుండగానే కాలిపోయింది. ప్రక్కయింటి సాంబయ్యగారు పైనవున్న ఉత్తరీయంతీసి ఆ పిల్లకు యిచ్చారు. వల్లె వాటు కప్పుకుని లోపలికి పారిపోయింది.

రాత్రి నిద్దరపోయే సమయానికి చాలా ప్రొద్దుపోయింది. రాత్రి ఎవరో తనపక్క దగ్గర నిలబడ్డట్టు అనిపించింది. ఉలిక్కిపడి అటుచూశాడు. ఆ పిల్ల నిలబడివుంది. "ఎవరూ?" అని అడిగాడు.

చెంగున లేడిలాగా మాయమైంది.

మర్నాడు నూతిదగ్గర స్నానం చేస్తూ తువ్వాలుకోసం కేకపెట్టాడు. సిగ్గుపడుతూ ఆ పిల్ల తీసుకుని వచ్చింది. తనని చూడగానే చిరునవ్వుగా తలవంచుకుంది. తను ఏం మాట్లాడలేదు. బొటనవేలు నేలమీద రాస్తూ తల వంచుకుని
మెల్లిగా "చెయ్యి బాగా కాలిందా?" అని అడిగింది. తనేం మాట్లాడలేదు. చెయ్యి ఆ పిల్లవంక చూపించాడు.

"ఎంతకాలిందో !!" అని బాధగా అన్నది.

"నీ పేరేమిటి?" అని అడిగాడు.

జానకి

"నా పేరు రామం" అని తనే అన్నాడు.

"మంచిపేరు!" అని జానకి అన్నది.

'నీకు నచ్చిందా?" అని రామం అడిగాడు.

తువ్వాలు జామచెట్టు కొమ్మ మీద వుంచి తూనీగలాగా పారిపోయింది. అది ఒక దశాబ్దం నాటి మాట.

"అత్తయ్యగారు, అమ్మ జున్ను పాలు యిచ్చిరమ్మంది" అంటూ ఒక మెరుపులాంటి అమ్మాయి ఒక మాఘమాసంలో పాలబెంబు తీసుకుని తమ యింటికి వచ్చింది.

ఆరోజు తనని యింటికి కాపలా పెట్టి అంతా ఎక్కడికో వెళ్ళారు. ఒంటరిగా ఉదయపు వెలుగులో, చిన్నది చనువుగానే నడచి వచ్చింది.

"అత్తయ్య ఎక్కడికో వెళ్ళింది. నేను అత్తయ్యగారి అబ్బాయిని అని తనకు తానే పరిచయం చేసుకున్నాడు"

చిన్నది జంకుగా ముందుకు వేసిన పాదం వెనక్కు తీసుకుని పాలచెంబు నేలమీద పెట్టి, వెళ్ళడానికని వెనక్కు తిరిగింది.

"అత్తయ్యను వెతుక్కుంటూ వచ్చిన ఈ కోడలు పేరేమిటో?" అని తను అడిగాడు.

చిన్నది గిరుక్కున వెనిక్క తిరిగింది, నిప్పులు చెరిగే కళ్ళతో తనవంక చూసింది.

"శ్యామల" అని సమాధానం చెప్పి అక్కడ నుంచి వెళ్ళిపోయింది.!

అమ్మ యింటికి రాగానే ఈ ఉదంతం అంతా విపులంగా చెప్పా ,

"నన్ను అత్తయ్యా అని పిలిచే వాళ్ళంతా నీకు మరదళ్ళు కాదు ఆ విషయం గుర్తుంచుకో?" అని అమ్మ మందలింపుగా హెచ్చరించింది.

అమ్మ అన్నమాట నిజమే అయింది శ్యామల తనతో ఎంత సన్నిహితంగా వున్న శ్యామలకు తనయందు ఆత్మీయత అభిమానం పెరిగినా చివరకు ఆనాడు వచ్చేసరికి. పెళ్ళి చూపులకు వచ్చిన పరాయి పెళ్ళికొడుకును చూసి, అతను పిల్ల నచ్చిందని చెప్పగానే, తను కూడా ఆ సంబంధానికి వప్పుకుంది.

ఆనాడు తన మనస్సు ఒక్క క్షణం చివుక్కుమన్నమాట నిజమే !! కాని మనస్సుని మనస్సే సమాధాన పరచుకుంది.

జానకి తన ఆలోచనలో నిలచిపోయింది. శ్యామల దూరంగా తరలిపోతే - జానకి అప్పుడప్పుడు చుట్టపు చూపుగా వచ్చిపోతున్నా, అందరికన్నా చేరువైంది- జానకి.

అనేక సార్లు అవకాశం వచ్చింది.

"జానకి నిన్ను ప్రేమిస్తున్నాను" అని చెప్పగల అవకాశం తనకు కలిగింది. కాని తను ఆ అవకాశాన్ని వినియోగించుకోలేదు.

జానకి నన్ను స్వీకరిస్తుందా అన్న ప్రశ్న అడ్డ వచ్చేది.

ఆరోజు ఆ అవకాశం యిహ ఎప్పటికీ రాదేమో !! వెళ్ళిపోయేలోపల ఒక్క సారి జానకిని చూడాలి."

ఎక్కడనుంచో దూరంగా మెల్లిగా ఒక కంఠం తనని పిలుస్తోంది. కన్ను తెరిచి చూడాలనిపిస్తోంది. కాని అంతా చీకటి ... చీకటి నుంచి వెలుగు చూడాలని ఎంతో ప్రయత్నం! ఆ ప్రయత్నం ఎంతసేపో తనకు తెలియదు.

ఎన్నో యుగాలు గడిచాయి. చీకటిలోకి మెల్ల మెల్లగా వెలుగు రావటం మొదలు పెట్టింది. వెలుగు భరించలేనంత తెల్లగావుంది. మళ్ళీ ఏమిటో చీకటి... చీకటిని చీల్చుకుంటూ ఎవరిదో మెత్తటి కంఠం.

రామం! రామం! అంటూ పిలుస్తోంది.

లీలగా ఏదో కనిపిస్తోంది. ఇల్లంతా నిశ్శబ్దం ఎక్కడా అలికిడి లేదు. ఎవరో తనని చూసి చిరునవ్వు నవ్వుతున్నారు. తను మాత్రం చాలా సేపు కన్నార్పకుండా ఆ మనిషి వంక చూస్తూనే ఉన్నాడు.

కాని ఏం కనిపించటంలేదు.

"రామం! రామం!" అంటూ పిలుపు వినిపిస్తోంది. పిలుపు దూరమైంది. ఎవరిదో కన్నీరు వినిపిస్తోంది.

అబ్బా! అంటూ ప్రక్కకి వత్తిగిలాడు...

మళ్ళీ ఎప్పుడు తెలివి వచ్చిందో? ఎటుచూసినా పట్టలేనంత వెలుగు...

అంతులేని నీరసం -

వెలుగులోంచి ఒకముఖం తనవంక చూస్తోంది. కన్నీటితో వాడిన ఆ కళ్ళవెనుక అంతులేని ఆనందం కనిపిస్తోంది.

నేను రామం ! జానకిని ! అని అంటుంది. తన పెదిమలు ఎంతో ప్రయత్నం మీద కదిలాయి.

తను ఏదో అన్నాడు. ఆ పిల్లముఖం కెంపువన్నెకొచ్చింది. ముఖం రెండు చేతుల్లో కప్పుకుంది.

ఆ రోజుకారోజు జ్వరం తగ్గిపోతుంది. మనస్సున కమ్మిన పీడకల దూరమవుతోంది. ఎటు చూసినా ఆనందం ఎటుచూసినా ఉల్లాసం !!

దానికి కారణం మనస్సులో మసలె ఏవేవో స్మృతులు. వాటిని వెంటబెట్టుకుని వచ్చిన జానకి!

శ్యామల ఎప్పుడు వెళ్ళిపోయిందో తెలియదు.

ఆ రోజు సాయంకాలం జానకి తనదగ్గరగా వచ్చి కూర్చుంది.

దిండు క్రింద చెయ్యిపెట్టాను. ఆ కాగితం యింకా అక్కడే వుంది తీసి మెల్లిగా చదవటం మొదలుపెట్టాను.

ఎంత పిరికివాడు. ఇంతమాత్రం దానికే భయపడి వీలునామా రాసే స్థితికి వచ్చాడు.

వంట్లో "ఎలా వుంది?" అని జానకి అడిగింది.

తనేం మాట్లాడలేదు, కాగితం ముక్కలు ముక్కలుగా చింపిపారేశాడ. జానకి వంక చెయ్యి జాపాడు. జానకి చెయ్యి తనచేతిలో వుంది. తన వ్రేలి వుంగరం ఆమె వేలికి తొడిగాడు.

జానకి ముఖంలో ఎంతో ఆనందం వెల్లి విరిసింది, ముఖం కెంపు వన్నె కొచ్చింది. తనచెయ్యి విడిపించుకోవడానికి ప్రయత్నంచేస్తూ మెల్లిగా "అత్తయ్యకు చూపించివస్తా!" అని అంది.

ఒక్క మాట అడగనా జానకి

ఉ

ఆరోజున నిన్నుచూడగానే నేనేమన్నాను.

జానకి సిగ్గుతో తలవంచుకుంది.

"నేను చెప్పను.. అంది

"నామీద ఒట్టు"

ఉలిక్కిపడి తనవంక చూసింది. ఏమిటా మాటలు?

"చెప్పవా!"

జానకి ఒక్కక్షణం తటపటాయించింది. అంతలోనే ఎక్కడలేని ధైర్యం కూడ తీసుకుని వంగి తన చెవి దగ్గర నెమ్మదిగా

"ఐ లవ్ యూ." అని అంది.